# సంసారంలో సంగీతం

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"ఏమండీ! స్వరాభిషేకం చూద్దామండీ" అంటూ టీవీ పెట్టి కళ్యాణ సుందరం చూస్తున్న ఆఫీసు కాగితాలు పక్కకు లాగి పెట్టింది రాగిణి.

"మొన్ననేకదే కార్తీకమాసం ఆఖరి సోమవారం అంటూ శివుడి గుడిలో రుద్రాభిషేకం చేయించావు. మళ్ళీ ఈ స్వరాభిషేకం దేనికి?" పెళ్లాం చేతిలోని కాగితాలు తిరిగి తీసుకుని లెక్కల్లోకి తల దూరుస్తూ అన్నాడు కళ్యాణ సుందరం.

రాగిణికి కోపం ముంచుకొచ్చింది. 'ఇదేం మొగుడమ్మా! మాటలు సరిగ్గా చెవిన వేసుకోడు. ఎంత ఆడిటరయితే మాత్రం లెక్కలు, కూడికలు తప్ప మరో విషయం పట్టకపోతే ఎలా? పుస్తకాలు, కథలు చదవడు. పాటలు వినడు. టీవీ సీరియల్స్ అక్కర్లేదు. ఇక ఇద్దరి మధ్యన మాట్లాడుకోవడానికి ముచ్చట్లేముంటాయి? ఖర్మ' అనుకుంటూ మూతి ముడుచుకుని కూర్చుంది. ఒక్కత్తే సినిమా చూడబుద్ధి కాక టీవీ కట్టేసింది.

చేస్తున్న పని ముగించాక ఆవులిస్తూ పడక మీదకు చేరిన కళ్యాణ సుందరం "షేర్ మార్కెట్ మంచి బుల్లిష్ ట్రెండులో ఉందోయ్. మనం కూడా కొన్ని షేర్లు కొందామా?" అనడిగాడు సగం నిద్ర గొంతుతో. మొగుడి నెత్తిమీద రెండు మొట్టికాయలు వేయాలన్నంత చిరాకు పుట్టింది రాగిణికి. 'ఒక పాటా లేదు, సినిమా లేదుగానీ షేర్లు, స్టాకుల గురించి మాట్లాడతాడు' అనుకుంటూ ముఖం తిప్పుకుంది.

రాగిణికి చిన్నప్పటినుంచీ సంగీతమంటే ఇష్టం. గురుముఖత నేర్చుకోవాలని కొన్ని ప్రయత్నాలు చేసిందిగానీ ఏవీ కలసిరాలేదు. సంగీత ప్రధానమైన సినిమాలు, టీవీ ప్రోగ్రాములు చూసి సంతోషపడుతుంటుంది. కళ్యాణ సుందరంకు సంగీతం, సాహిత్యమంటే బొత్తిగా అభిరుచిలేదు. రాగిణికి అతను మాట్లాడే సెన్సెక్స్ కదలికలూ, బ్యాంకు ఇంటరెస్టు రేట్లూ అంటే తలనొప్పి. ఇక ఇద్దరి మధ్యన మాటా మంతీ, ముద్దూ ముచ్చట్లు ఏముంటాయి?

'అదేదో సినిమాలోలాగా తిండి యావ వున్న ఇద్దరు దంపతులైతే తిండి గురించి ముచ్చట్లాడుకుంటారు. పత్రికలలో కథలు, సీరియల్స్ చదివే అలవాటున్న వాళ్లయితే కథ ఏ మలుపు తిరుగుతుందో, ఏ పాత్ర ఎటువంటిదో వాదించుకోవచ్చు. ఈ కళ్యాణ్‌తో ఏం మాట్లాడాలి? లాభం లేదు. అతనికి నెమ్మదిగా సంగీతం అంటే ఇష్టం వుండేట్లు చేయాలి' అనుకుంటూ నిద్రపోయింది రాగిణి.

***

ఉదయం ఏడుగంటలవుతున్నా ముసుగు తీయని మొగుడి పక్కన కూర్చుని మురిపెంగా అతని ముఖం మీది దుప్పటి లాగేసి 'విన్నపాలు వినవలె వింత వింతలూ... పన్నగపు దోమతెర పైకెత్తవేమయ్యా' అంటూ భానుమతి గొంతులోని మాధుర్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ భూపాలరాగంలో పాడింది రాగిణి.

"అబ్బా పొద్దునే దోమలు, చీమలు అంటూ నన్ను లేపకపోతే ఆ హిట్ కాస్త కొట్టుకోకూడదు?" అని దుప్పటి ముఖం మీదకి లాక్కున్నాడు కళ్యాణ సుందరం 'దోమతెర'లో దోమ అన్న మాటకు స్పందిస్తూ. ఉసూరుమనిపించింది రాగిణికి. 'ఇలాకాదు, ఇతగాడితో' అనుకుంటూ వంటింట్లోకి వెళ్లి ఘుమఘుమలాడే కాఫీ కలిపి తీసుకువచ్చింది.

"ఏమండీ కాఫీ" అంటూ దుప్పటి లాగబోయింది. కళ్యాణసుందరం కదల్లేదు.

"పిలచినా బిగువటరా? ఔరౌర చెలువలు తామే వలచి వచ్చిన" అంటూ మల్లీశ్వరిలోని పాట అందుకుంది రాగిణి.

"ఏం బిగుతయ్యిందే? పొద్దున్నే అలా గెంజు కోకపోతే ఆ జాకెట్లు కాస్త వదులుగా కుట్టించుకోరాదూ?" 'బిగువు' అన్న ముక్క మాత్రం తలకెక్కించుకున్న సుందరం సలహా ఇచ్చాడు.

కొందరు ఆడవాళ్లు అప్పడాల కర్రను అంత ప్రియంగా ఎందుకు చూసుకుంటారో అప్పుడు అర్థమయింది రాగిణికి. అయినా ఓరిమి వహించి కోపం దిగమింగి అతనికి కాఫీ అందించి లోపలకు వెళ్లిపోయింది. అతను పేపరు చదవడం ముగించి స్నానానికి వెళ్లబోతుంటే రాగిణి అతని దగ్గరగా వచ్చి మురిపెంగా క్రాఫ్ మీద చేయివేసి "ఇవాళ మీరు సెలవు పెట్టాలి" అంది.

రాత్రిపూట కూడా జేబులో దువ్వెన పెట్టుకుని లేవగానే తల దువ్వుకునే సుందరం ఆవిడ క్రాఫ్ చెరిపేయకముందే చెయ్యి తోసేసాడు.

"ఆఫీసులో పని ఎక్కువగా వుందోయ్. అయినా ఇవాళ పండుగకాదు, పెళ్లిరోజు ఆర్నెల్ల దాకా రాదుకదా" అంటూ నీళ్లగదిలోకి దూరాడు. ఎప్పటికైనా బయటకు రాకపోడు కదా అని గుమ్మం ముందే కుర్చీ వేసుకుని కూర్చుంది రాగిణి. కళ్యాణ సుందరం స్నానం ముగించి తలుపు తీసుకుని బయటకు వస్తుండగానే పాట అందుకుంది రాగిణి.

"వద్దురా కన్నయ్యా... ఈ పొద్దు ఇలు వదలి పోవద్దురా వద్దురా... వద్దురా..." అంటూ పరవశంగా రాగం తీసింది. కళ్యాణ సుందరం కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అతడు తన పాటకే కరిగి కంట తడి పెడుతున్నాడనుకున్న రాగిణి కళ్లు కూడా చెమర్చాయి సంగీతం మహత్యం తలచుకుని.

"నన్ను కళ్యాణీ అని పిలిచినా సహిస్తాను గానీ అలా వద్దురా, పోరా, రారా అనొద్దు ప్లీజ్" అంటూ చేతులు పట్టుకున్నాడు సుందరం.

రాగిణికి నోట మాట రాలేదు. కాసేపటికి పైట చెంగు నోట్లో కుక్కుకుని వెక్కిళ్లు పెట్టసాగింది.

"ఏడవకురా రాగీ! సరే ఇవాళ ఆఫీసుకు వెళ్లనులే" అన్నాడు కళ్యాణ సుందరం కరిగి నీరై పోయి.

"నన్ను రాగీ, జొన్న అని పిలవొద్దన్నానా?" రోషంగా విదిలించుకుంది రాగిణి.

"మరి ముద్దుగా పిలవాలంటే పేరు పొట్టిగా చేయాలికదా! అందుకని... సరే ఇంతకీ సెలవు పెట్టి ఏం చేద్దాం?" ప్రేమగా అడిగాడు.

"పండుగ దగ్గరకొస్తోందిగా. బజారుకెళ్లి చీర కొందాం'' ఉత్సాహంగా అంది రాగిణి.

"నెలాఖరున షాపింగా?'' నీరసపడ్డాడు.

"నేనేం పట్టుచీర కొనమన్నానా? కలకత్తాకాటన్ చీర కొనుక్కుంటానంతే'' అంది ఉదారంగా.

"మన దగ్గర ఉన్న ఊళ్ల చీరలు బాగుండవా ఏం?'' అన్నాడు సుందరం నోరుజారి.

రాగిణి మెదడులో మెరుపు మెరిసినట్టయింది. అవకాశం సద్వినియోగపరచుకుంటూ 'రఘువంశ సుధాంబుధి' బాణీలో సినిమాలో వచ్చిన 'యమహా నగరి కలకత్తాపురి' అంటూ చిరంజీవికి పాడిన గాయకుడికి మనసులోనే అంజలి ఘటిస్తూ 'కదన కుతూహళ రాగంతో పాట అందుకుంది. ఉత్సాహంగా స్వరాలు జోడించి 'సారిమ గారిస రీమమ ధాధని గాగప సాసని' అంటూ పాడి ముగించేసరికి సుందరం అక్కడ లేడు.

వంటింట్లో నుండి గ్లాసుతో నీళ్లు తీసుకువచ్చి పెళ్లానికి అందిస్తూ "ఈ మాత్రం దానికి నువ్వింత ఆయాసపడాలా రాగీ. అలాగే కలకత్తా కాటను చీరే కొందాంలే'' అన్నాడు ప్రేమగా.

"అయితే తొందరగా వంట చేసేసి తయారవుతాను'' అని తన సంతోషాన్ని పాట రూపంలో పెట్టాలని 'వాడిన పూలే వికసించెలే, చెర వీడిన హృదయాలు పులకించెలే' అని పాడుతూ సుందరం మెడ చుట్టూ చేతులు వేసింది. కిందపడబోయి నిలద్రొక్కుకున్నాడు.

షాపింగ్‌కు వెళ్లివచ్చాక అన్నం తిని ఇద్దరూ నిద్రపోయారు. సుందరం లేచేసరికి అతనికి ఇష్టమైన మిరపకాయల బజ్జీలు చేసి పెట్టి స్నానం చేసి జరీ అంచు తెల్లచీర కట్టుకుని మల్లెపూలు జడలో ముడుచుకుని కూర్చుని ఉంది రాగిణి. లేవగానే వంటింట్లోకి వెళ్లి వస్తూ "అబ్బ... అదిరిపోయింది'' అన్నాడు రాగిణి వంక చూస్తూ. రాగిణి మురిసిపోయింది. వెంటనే 'తెల్లచీర కట్టినా, మల్లెపూలు పెట్టినా కల్లకపటమెరుగని మనిషి కోసము, ఆ మనిషిలోన దాగివున్న మమత కోసము' అంటూ శ్రావ్యంగా రాగం తీసింది.



"బజ్జీల రుచి అదిరిపోయిందంటుంటే పాట పాడతావెందుకూ?" అనడిగాడు కళ్యాణ సుందరం. జవాబు కోసం చూడకుండానే మళ్లీ వంటింట్లోకి వెళ్లి రెండు పళ్లాలలో బజ్జీలు తీసుకువచ్చి ప్రియంగా రాగిణికి అందించాడు. తన ముస్తాబు వృధా అయినందుకు, ప్రశంసలు బజ్జీలకు దక్కినందుకు నిరాశగా అనిపించినా అనుకున్నది సాధించాలన్న పట్టువదలని రాగిణి అనునయంగా అంది "జీవితంలో పాటలు లేకపోతే పస ఏముంటుంది? సంగీత జ్ఞానము భక్తి వినా సన్మార్గము కలదే?' అన్నారుకదా త్యాగరాజుగారు" అని అంది.

"ఆయనెవరు? ఇన్ని మాటలు నీతో ఎప్పుడు మాట్లాడారు?" బజ్జీలు తినడం ఆపి అనుమానంగా అడిగాడు సుందరం.

"మన పక్కింటాయనలెండి" కోపంగా అని అంతలో శాంతించి "ఈసారి ఆయన ఆరాధనోత్సవాలకు మిమ్మల్ని తీసుకెళ్లి పంచరత్న మాలిక వినిపిస్తానులెండి" అంది రాగిణి.

"వద్దొద్దు" కంగారుగా అన్నాడు కళ్యాణ సుందరం.

"మీరు సంగీతం నేర్చుకోరాదూ ఎంచక్కా? మీ దగ్గర నేను నేర్చుకుంటాను" గోముగా అడిగింది రాగిణి.

"సంగీతమా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకేమిటండీ?" అంటూ శంకరాభరణం అందుకుంది రాగిణి. 'అద్వైత సిద్ధికి, అమరత్వ లబ్ధికి గానమె సోపానము, తత్వ సాధనకు, సత్య బోధనకు సంగీతమె ప్రాణము' అని పాడి అతని స్పందన కోసం చూసింది.

'సోపానము' అన్న పదంలో సోఫా అని చెవిన పడిన సుందరం "అన్నట్లు మొన్న మా స్నేహితుడు మంచి సోఫా సెట్టు కొన్నాడు. మనింట్లోకి కావాలన్నావుకదా. నీకు నచ్చితే అలాంటిది కొందాం" అన్నాడు కళ్యాణ సుందరం. రాగిణికి ఏం మాట్లాడాలో తోచక మౌనం వహించింది. కోపం వచ్చినా సోఫా వద్దని చెప్పడానికి మనసు రాలేదు.

రాత్రి భోజనాల దగ్గర పరధ్యానంగా కనబడిన రాగిణిని చూసి "అమ్మ మీద గాలి మళ్లిందా? చెల్లాయి గుర్తుకొచ్చిందా?" అనడిగాడు లాలనగా.

అతని ప్రేమకు కరిగిపోయిన రాగిణి "ఎదురుగా మీరుండగా ఎవరైనా గుర్తుకువస్తారా?" అంటూ చెంపల పుణికింది.

తరువాత తల నిమురుతుందేమోనని క్రాఫ్‌కి చేతులు అడ్డం పెట్టుకున్న మొగుడ్ని మురిపెంగా చూసి హిందోళ రాగంలో పాట అందుకుంది 'కలనైనా నీ తలపే...కలవరమందైన నీ వలపే... కలువ మితారవు కమ్మని కలలు...కళలు కాంతులు నీ కొరకే' అంటూ.

పాట ముగిసేసరికి వంటింట్లో నుండి "చక్కెర డబ్బా ఎక్కడుంది? కాఫీ కలుపుతున్నా" అంటూ కేక పెట్టాడు సుందరం.

★★★

రాత్రి పదిన్నరకు వార్తలు వింటున్న మొగుడికి అడ్డంగా నిలబడి "టీవీ కట్టేసి పడుకోండి. రేపు ఆఫీసుకెళ్లాలి" అంది రాగిణి.

"ఎంతైనా నీకు నామీద ప్రేమ ఎక్కువే" అంటూ మంచంమీద వాలాడు సుందరం.

వెంటనే "ఏమి మంత్రము వేసినావో... ఏమి మత్తును చల్లినావో మనసు నీ వశమైనది" అంటూ కళ్యాణ సుందరాన్ని కౌగలించుకుంది రాగిణి.

"అవునూ మత్తుమందులు స్కూళ్లల్లో కూడా అమ్ముతున్నారని పేపర్లో వేసారు. చూసావా?" హఠాత్తుగా లేచి కూర్చుని అడిగాడు సుందరం.

"భగవంతుడా! 'అరసికేషు కవిత నివేదనం శిరసి మాలిఖ'" అంటూ తల బాదుకుంది రాగిణి.

"తలనొప్పిగా ఉందా చిన్నీ... వుండు అమృతాంజనం సీసా తెస్తాను" అంటూ వుసిరికాయంత ముద్ద తీసి రాగిణి నుదుటిమీద రాసి మర్దనా చేయసాగాడు సుందరం. రాగిణికి ఆ ప్రేమ ఘాటుకు కళ్లల్లో నీరు తిరిగింది. "ఇక చాలు పడుకోండి" అంది ప్రేమగా.

అర నిముషంలో నిద్రలోకి జారుకున్న మొగుడి జుత్తు నిమురుతూ "జో అచ్యుతానంద జోజో ముకుందా లాలి పరమానంద రామ గోవిందా" అని నీలాంబరి రాగంలో పాడసాగింది.

అంత నిద్రలో కూడా క్రాఫ్ చెరిగిపోతుందేమోనన్న కంగారుతో ఆమె చేయి పక్కకు తోసేసి గుర్రు పెట్టసాగాడు సుందరం.

"నీకు సంగీతంమీద ప్రేమ ఏర్పడేదాకా పట్టువదలనులే కళ్యాణీ" అనుకుంటూ మరికొన్ని పాటలను మరునాటి కోసం గుర్తుకు చేసుకుంటూ కళ్లు మూసుకుంది రాగిణి.

★



## ఐశ్వర్యారాయ్ క్రేజ్!

సినిమా హీరోయిన్‌లకి పెళ్లయితే ఇక క్రేజ్ వుండదని అంటారు. చాలామంది తారల విషయంలో ఇది ప్రూవ్ అయింది కూడా. కానీ ఐశ్వర్యారాయ్ విషయంలో మాత్రం ఇది నిజం కాదని తేలింది. ఐశ్వర్యారాయ్ పెళ్లయి ఏడాది కావస్తోంది. కానీ ఇంకా ఆమె క్రేజ్‌లో ఏమాత్రం మార్పు రాలేదనటానికి ఉదాహరణగా అన్నట్టు పెద్ద పెద్ద సినిమాల్లో ఆమెకి ఇంకా అవకాశాలు వస్తుండడమే. 2009 చివరి వరకూ ఆమె కాల్షీట్లు ఖాళీ లేవని బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి.

